## ఓటరు నమోదు ప్రారంభం

■ రామాయంపేట, డిసెంబర్ 15 : 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రజినీకుమారి సూచించారు. శుక్రవారం రామాయంపేటలో వివరాలు వెల్లడించారు. జనవరి 1, 2024 లోగా 18 ఏండ్లు నిండుతున్నవారు ఓటరు నమోదు దరఖాస్తును బీఎల్వోలకు అందజేయాలన్నారు. బీఎల్వో కేంద్రాల్లో పూర్తి వివరాలను దరఖాస్తుగా అందజేయాలని, ఓటరు కార్డులో మార్పులు లేదా చేర్పులకు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మెదక్‌ను చార్మినార్ జోన్‌లో చేర్చాలి

■ నర్సాపూర్, డిసెంబర్ 15 : ఉద్యోగ నియామకాల్లో మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి తప్పించి, చార్మినార్ జోన్‌లో చేర్చాలని నర్సాపూర్ పట్టణానికి చెందిన విద్యార్థులు శుక్రవారం తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో చేర్చాలన్నారు. సిరిసిల్ల జోన్‌లో ఉండడంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అక్షయ్‌గౌడ్, వరుణ్, సాయిరాం, అభి, సాయి, శ్రీధర్, నితిన్, రమ్యశ్రీ, ప్రణయ, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెప్రగతి పనుల పరిశీలన

■ నిజాంపేట, డిసెంబర్ 15 : నస్కల్‌లో కొనసాగుతున్న పల్లెప్రగతి పనులను శుక్రవారం ఎంపీడీవో జగదీశ్వర్ చారి, ఎంపీవో రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ, డంపింగ్ యార్డు, ఓపెన్ జిమ్, పల్లెప్రకృతి వనాలకు పరిశీలించారు. గ్రామస్తులు పరిసరాల శుభ్రతకు కృషి చేయాలని సూచించారు. నర్సరీలో మొక్కలకు సకాలంలో నీళ్లు అందిస్తూ పశువుల బారి నుంచి సంరక్షించాలని వనసేవకులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కవితారాజు, కార్యదర్శి సబిత ఉన్నారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె

■ వెల్దుర్తి, డిసెంబర్ 15 : కమలేశ్‌చంద్ర నివేదికను అమలు చేయాలని ఈ నెల 12 నుంచి దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీ ఆంజనేయులు, వైస్ సెక్రటరీ మజర్ తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి తపాలా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమలేశ్‌చంద్ర కమిటీ సిఫార్సు చేసిన సీనియార్టీ ఇంక్రిమెంట్, ఎక్స్‌గ్రేషియా, వైద్య సౌకర్యం, పెన్షన్ అమలు చేయాలని కోరారు. ధర్నాలో ట్రెజరీ రఘురాములు, తపాలా ఉద్యోగులు అశోక్, శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటేశ్, ఆంజనేయులు ఉన్నారు.

## మొక్కలను కాపాడాలి

■ రామాయంపేట, డిసెంబర్ 15 : పట్టణంలోని కోమటిపల్లి, గొల్పర్తితోపాటు వివిధ గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీవో ఉమాదేవి పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను కాపాడే బాధ్యత కార్యదర్శులదేనన్నారు. ప్రతి మొక్కనూ సంరక్షించాలని, మంచు ప్రభావంతో మొక్కలు రంగు మారుతాయని, దీని నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో గిరిజారాణి, కార్యదర్శులు శామల, పద్మ, మహేందర్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## పన్నులు చెల్లించాలి

■ చిలిపిచెడ్, డిసెంబర్ 15 : గ్రామాల్లో ప్రజలు ఇంటి, నల్లా బిల్లులు తప్పకుండా చెల్లించాలని కార్యదర్శి జితేందర్ సూచించారు. శుక్రవారం చండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజల నుంచి ఇంటి, నల్లా బిల్లులు వసూలు చేశారు. గ్రామంలో ఇప్పటివరకు 95 శాతం బిల్లులు వసూలు చేశామన్నారు. ప్రజలు పన్ను చెల్లించాలని కోరారు.

## ఆలయంలో చోరీ

■ చిలిపిచెడ్, డిసెంబర్ 15 : చిట్కుల్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి, చోరీ చేశారు. హనుమాన్ ఆలయంలో హుండీని ధ్వంసం చేసి సుమారు రూ.20 వేల నగదు, వెండీ వస్తువులను చోరీ చేశారని సర్పంచ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీని రెండేండ్లుగా లెక్కింపు చేయలేదన్నారు. ఎస్సై షేక్ మహబూబ్ ఆలయాన్ని పరిశీలించారు.

## శుభ్రత పాటించాలి

■ వెల్దుర్తి, డిసెంబర్ 15 : రోగులకు దవాఖానలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని ఎంపీపీ స్వరూప, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానను వైస్‌ఎంపీపీ సుధాకర్‌గౌడ్, డాక్టర్ సౌజన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దవాఖానలో అందుతున్న వైద్యం, సిబ్బంది పనితీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో శుభ్రత పాటించాలన్నారు. దవాఖాన మంచి పరిసరాలతో కనిపించాలని దీంతోనే వారికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. దవాఖాన సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామన్నారు.

## నారుమడుల పరిశీలన

■ నర్సాపూర్, డిసెంబర్ 15: చలి ప్రభావం నుంచి నారుమడిని రక్షించడానికి జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో అనిల్ కుమార్ సూచించారు. సాయంత్రం నారుమడిలో నీరు తీసి, పగటి పూట నీరు పారించాలన్నారు. ఈ మేరకు వరినారు మడులను పరిశీలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ **రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల** ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.

**NT-314474**

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ఆరోపణలపై చర్చకు సిద్ధం?

పాపన్నపేట, డిసెంబర్ 15 : కక్ష సాధింపులో భాగంగా అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్ సవాల్ చేశారు. ఉప సర్పంచ్ ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టిన నేపథ్యంలో శుక్రవారం జగన్ మాట్లాడాడు. రాజకీయంగా దెబ్బతీయడానికి తాను అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారని, ఇది అవాస్తవమన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు గడ్డం రాజు, మహేశ్, కవిత, భూదమ్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- పనిచేసిన వారికే ప్రజల్లో గుర్తింపు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ హరికృష్ణ
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొనసాగించాలి
- ఎంఈవో బుచ్యానాయక్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట, డిసెంబర్ 15 : గ్రామాల్లో అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తే గుర్తింపు ఉంటుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హరికృష్ణ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను సభలో వివరించారు. ఎంపీపీ హరికృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల సమన్వయంతో కలసి అభివృద్ధి పనులు చేసి ప్రజల మెప్పు పొందాలన్నారు. శివ్వంపేట మండలంలో పదేండ్ల కాలంలో అభివృద్ధి పనులకు అన్ని విధాలుగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకరించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తెచ్చిందని, మహిళలు కచ్చితంగా ఏదైనా గుర్తింపు కార్డు దగ్గర ఉంచుకునేలా ప్రజాప్రతినిధులు వివరించాలని కోరారు. ఎంఈవో బుచ్యానాయక్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం 'మనఊరు-మనబడి' కింద పాఠశాలలను బలోపేతం చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని చిన్నగొట్టిముక్ల పాఠశాలలో ప్రారంభించామని, దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. సమావేశం లో పీఆర్‌ఏఈ భాస్కర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీకోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి, ఎంపీటీసీ దశరథ, సర్పంచ్‌లు లావణ్య, సుధాకర్‌రెడ్డి, ఏవో లావణ్య, ఏపీవో అనిల్‌కుమార్, డాక్టర్ సాయిసౌమ్య ఉన్నారు.

